లంకెలపాలెం జంక్షన్‌లో ట్రాఫిక్ సమస్యకు చెక్

- ఎంపీ సత్యవతి, పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్
- రహదారి విస్తరణ పనులకు శంకుస్థాపన



రహదారి విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యే అదీప్‌రాజ్

అగనంపూడి: జాతీయ రహదారి లంకెలపాలెం కూడలిలో ట్రాఫిక్ సమస్యను అధిగమించడానికి చర్యలు చేపట్టామని అనకాపల్లి ఎంపీ భీశెట్టి సత్యవతి అన్నారు. 79, 85 వార్డుల కూడలి లంకెల పాలెం జాతీయ రహదారి కూడలి విస్తరణ పనులకు ఆమె బుధవారం శంకుస్థాపన చేశారు. ఎంపీ మాట్లాడుతూ ఉదయం, సాయంత్రం వేళల్లో కూడలిలో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉండటంతో రహదారి విస్తరణ, ఫ్రీ లెఫ్ట్ ఏర్పాటుకు రూ.43లక్షలు ఆర్థిక సంఘం నిధులు కేటాయించామని తెలిపారు. గతంలో గాజువాక నుంచి ఫార్మాసిటీ కాలనీ వైపు వెళ్లే మార్గంలో ఫ్రీ లెఫ్ట్ ఏర్పాటు చేయడం వల్ల ఈ మార్గంలో ట్రాఫిక్ సమస్య చాలా వరకు తీరిందన్నారు. లంకెలపాలెం ఫ్లైఓవర్ వంతెన సమస్య రైల్వే అధికారుల పరిశీలనలో ఉందన్నారు.

అధికారుల దృష్టికి డ్రైనేజీల నిర్మాణం .. పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మాట్లాడుతూ కూడలిలో డ్రైనేజీల నిర్మాణం విషయాన్ని ఎన్‌హెచ్ఏఐ అధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. లంకెలపాలెం శరవేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. రెండు జిల్లాలకు సరిహద్దుగా ఉన్న లంకెలపాలెం కూడలి రానున్న రోజుల్లో కీలకం కానుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఇల్లపు వరలక్ష్మి, ప్రసాద్, రౌతు శ్రీనివాసరావు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జి.పూర్ణానందశర్మ , ఎంఎస్ఎంఈ డైరెక్టర్ శీలం నదియా, 79వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ అప్పికొండ మహాలక్ష్మినాయుడు, నాయకులు సుందరపు అప్పారావు, పచ్చికోరు రమణమూర్తి, దాసరి తాతారావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉత్సాహంగా విద్యార్థుల కోలాటం



కోలాటమాడుతున్న విద్యార్థులు

గాజువాక : గాజువాక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు బుధవారం కోలాటం నేర్పించారు. గ్రంథాలయాధికారి బి.చంద్రకళ ఆధ్వర్యంలో ప్రారంభించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కోలాటం అనంతరం యోగా గురు ఎం.లీలాదుర్గ ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగాసనాలను నేర్పించారు. ఈ సందర్భంగా వారితో వివిధ ఆటలను ఆడించారు.

కుక్కల స్వైర విహారం



అక్కిరెడ్డిపాలెంలో రోడ్డుపై కుక్కల గుంపు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో కుక్కల స్వైరవిహారంతో స్థానికులు బెంబేలెత్తుతున్నారు. ఇళ్లలోకి చొరబడుతుండడంతో హడలిపోతున్నారు. వీధి కుక్కల దాడితో చిన్న పిల్లలను రోడ్డుపైకి పంపాలంటేనే భయపడుతున్నారు. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారి వెంట పడుతుండడంతో, తరచూ ప్రమాదాలకు గురై, గాయాల పాలవుతున్నారు. అధికారులు స్పందించి, చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ఒత్తిడి దూరం



ప్రసంగిస్తున్న రాజయోగిని మాధురి

గాజువాక : విద్యార్థుల్లో సృజనాత్మకతను మేల్కొలిపే విధంగా ఉపాధ్యాయులు బోధన సాగించాలని ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం రాజయోగిని మాధురి సూచించారు. స్థానిక యాపిల్ ఐ స్కూల్‌లో నిర్వహించిన ఉపాధ్యాయుల శిక్షణ శిబిరంలో ఆమె ప్రసంగించారు. విద్యార్థి దశ నుంచే చిన్నారులకు ఆధ్యాత్మిక చింతనను అలవాటు చేయాలని, దీనివల్ల ఒత్తిళ్లను తట్టుకొని ప్రశాంతంగా ఉంటారని అన్నారు. ప్రశాంతంగా ఉన్నవారు తమ లక్ష్యాలను అధిరోహించగలుగుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఛైర్మన్ టి.బలరామకృష్ణ, ప్రిన్సిపాల్ ప్రమీలా ముఖర్జీ తదితరులు పాల్గొన్నారు.

సైకిల్ యాత్రికుడికి సత్కారం



ప్రశాంత్‌ను సత్కరిస్తున్న ట్రస్టు సభ్యులు

కంచరపాలెం: కంచరపాలెం నుంచి నేపాల్ వరకు సైకిల్ యాత్ర చేసిన ప్రశాంత్‌ను కంచర పాలెం దుర్గానగర్‌లోని హన్నాహ్ అనాథాశ్రమంలో ట్రస్టు సభ్యులు బుధవారం ఘనంగా సత్కరించా రు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చిన 'బేటీ బచావో- బేటీ పడావో' నినాదంతో దేశ వ్యాప్తంగా 26 రోజులు 2370 కిలోమీటర్లు సైకిల్ యాత్ర చేసినట్లు ప్రశాంత్ తెలిపారు. ముఖ్య అతిథి ధాత్రి ఫౌండేషన్ చైర్మన్ సీహెచ్ విశాలక్షి, ఇతర ప్రముఖులు ప్రశాంత్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ధాత్రి విశాలాక్షి మాట్లాడుతూ సమాజంలో మహిళలపై వివక్షను అరికట్టడానికి సైకిల్ యాత్ర చేయడం ఎంతో అభినందనీయమన్నారు. సామాజిక సేవకురాలు అనురాధ స్ఫూర్తితో ఆమె కుమారుడైన ప్రశాంత్ మహిళలపై జరుగుతున్న నేరాలను నివారించాలని యాత్ర చేయడం ప్రశంసనీయమని కొనియాడారు. అనంతరం సైకిల్ యాత్ర విజయోత్సవ కేక్‌ను ప్రశాంత్ కట్ చేసి అనాథ పిల్లలకు అందజేశారు.

ఐక్య పోరాటాలతోనే విజయం



దీక్షలో కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న ఓబులేసు

కూర్మన్నపాలెం: కార్మిక వర్గాన్ని అణచివేసేందుకు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు దుర్మార్గమని ఏపీ స్టేట్ ఏఐటీయూసీ జనరల్ సెక్రటరీ ఓబులేసు అన్నారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షల్లో 846వ రోజు బుధవారం ఆయన పాల్గొని, మాట్లాడారు. విశాఖ ఉక్కు పరిశ్రమను అమ్మాలనే ఆలోచన వచ్చిన మోదీ ప్రభుత్వానికి ప్రజలు గట్టిగా బుద్ధి చెప్తారన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, ఈ ప్రయత్నాలను కార్మిక వర్గం తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగే ఉద్యమంలో ప్రజలందరినీ భాగస్వాములు చేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఉక్కు పరిశ్రమను చేజార్చుకోకూడదని అన్నారు. దీక్షలో సంస్థకు చెందిన బ్లాస్ట్‌ఫార్నేస్ విభాగ కార్మికులు కూర్చున్నారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయకుడి విగ్రహ ప్రతిష్ట



విగ్రహ ప్రతిష్టా మహోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పల్లా

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి సాయినగర్ కాలనీలో శ్రీలక్ష్మీ గణపతి ఆలయంలో వినాయక విగ్రహ ప్రతిష్టా మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం ఉదయం నుంచి విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో సాయినగర్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు చేకూరి నాగరాజు, ప్రతినిధులు కత్తి తిలక్ ప్రదీప్ చంద్ర, కర్రి దోశేంద్ర, దొక్కా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే మానవాళి మనుగడ



బీసీ హాస్టల్‌లో మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ వంశీరెడ్డి

పెదగంట్యాడ: మొక్కలతోనే మానవాళి మనుగడ సాధ్యమని 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి అన్నారు. వార్డు పరిధిలోని దయాల్‌నగర్‌లో గల ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహం ఆవరణలో కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ ఆధ్వర్యంలో బుధవారం మొక్కలు నాటారు. వంశీరెడ్డి మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా కోరమాండల్ సీఎస్సార్ నిధులతో ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కోరమాండల్ హెచ్‌ఆర్ డీజీఎం ఆర్.శ్రీనివాసరావు, సీఎస్సార్ విభాగం హెడ్ ఎస్‌వీ రమణ, రాజీవ్, బొడ్డు గోవింద, ఎస్.రాజారావు, దుర్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు

పెదగంట్యాడ: మృతుల కుటుంబాలకు వైఎస్సార్ బీమా ధైర్యాన్ని ఇస్తుందని 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు అన్నారు. వార్డు పరిధిలోని అశోక్‌నగర్‌కు చెందిన ఉక్కు ఒప్పంద కార్మికుడు పలివెల కోదండరావు ఇటీవల మృతి చెందాడు. ఈ నేపథ్యంలో మృతుని కుటుంబ సభ్యులను కార్పొరేటర్ బుధవారం పరామర్శించారు. వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేల నగదును మృతుని భార్యకు అందజేశారు. కార్యక్రమంలో గౌరీశంకర్, సత్యనారాయణ, పైడిరాజు, రాంబాబు, రెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

సీఐటీఎస్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: స్థానిక ప్రభుత్వ ఐటీఐలోని ఇన్‌స్టిట్యూట్ ఫర్ ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్ (ఐటీఓటీ) ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, వెల్డర్ ట్రేడుల్లో 2023–24 సంవత్సరానికి గాను క్రాఫ్ట్ ఇన్‌స్ట్రక్టర్ ట్రైనింగ్ స్కీమ్ (సీఐటీఎస్)లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ కె.ఎస్. శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ నెల 17లోగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. వీరికి వచ్చే నెల 8న ఆన్‌లైన్‌లో ఆలిండియా కామన్ ఎంట్రన్స్ టెస్ట్, కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) ఉంటుందని పేర్కొన్నారు. ఈ శిక్షణ కోసం ఐటీఐ అప్రెంటిస్ పాసైన అభ్యర్థులు, డిప్లొమా, డిగ్రీ పాసైన వారు అర్హులని తెలిపారు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, వెల్డర్‌లో 25 సీట్లు చొప్పున భర్తీ చేయనున్నట్లు తెలియజేశారు. www. nimionlineadmission. in ద్వారా దరఖాస్తు చేయాలని సూచించారు.

టెన్త్ విద్యార్థులకు నగదు పురస్కారాలు



విద్యార్థులకు నగదు పురస్కారాలు అందిస్తున్న మయూరి బుజ్జి

అగనంపూడి: పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు వాసవి క్లబ్ ప్రతినిధి వుడా సత్యనారాయణ (మయూరి బుజ్జి) నగదు పురస్కారాలు అందించారు. సత్యనారాయణ కుమారుడు అశ్వంత్ జయంతి సందర్భంగా వీటిని అందజేశారు. పదో తరగతి ఫలితాల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన షేక్ సాబీర్, దాసరి పూర్ణ పూజిత, పెరుగు నాగమణిలకు పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వీటిని అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కృష్ణారావు, కమిటీ చైర్మన్ బంధం అప్పలరాజు, కమిటీ ప్రతినిధులు, ఉపాధ్యాయులు రవికుమార్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు

కల్యాణం.. కమనీయం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్ఠంపజేశారు. ఉదయం 9.30 గంటల నుంచి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. విశేషంగా హారతులు ఇచ్చారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాన్ని అందజేశారు.

క్రమశిక్షణతోనే ఉన్నత శిఖరాలకు..



కబడ్డీలో శిక్షణ పొందిన వారికి, కోచ్‌కు టీ షర్టులు, జ్ఞాపిక అందజేస్తున్న డీసీపీ విజయసాగర్ నాయుడు

ఆరిలోవ: క్రమశిక్షణతోనే విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని లా అండ్ ఆర్డర్ డీసీపీ విజయసాగర్ నాయుడు అన్నారు. తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆరిలోవ సీఐ సోమశేఖర్ ఆధ్వర్యంలో గత నెల 1వ తేదీ నుంచి నిర్వహించిన ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు సెలవులను వృథా చేసుకోకుండా, సద్వినియోగం చేసుకునేందుకు ఇటువంటి శిబిరాలు దోహదం చేస్తాయన్నారు. పిల్లలు చెడు అలవాట్లకు గురి కాకుండా తల్లిదండ్రులు గమనించాలన్నారు. తల్లిదండ్రుల మాట వినని పిల్లల గురించి పోలీసులకు తెలియజేస్తే, వారికి కౌన్సెలింగ్ ఇచ్చి మంచి మార్గంలో పెట్టడానికి ప్రయత్నిస్తారన్నారు. తోటగరువు హైస్కూల్లో చదువుతున్న పిల్లల్లో కొందరు క్రమశిక్షణా రాహిత్యంతో ఉన్నట్లు తెలిసిందని, అలాంటివారిని సక్రమ మార్గంలో పెట్టడానికి వారి తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. సుమారు 200మంది పిల్లలకు క్రీడా శిబిరం ఏర్పాటు చేసి, కబడ్డీ, వాలీబాల్, బాస్కెట్ బాల్, ఫుట్‌బాల్, బాక్సింగ్‌తో పాటు యోగా శిక్షణ ఇప్పించిన ఆరిలోవ సీఐని ఆయన అభినందించారు. శిబిరం నిర్వహణలో సహకారం అందించిన పినాకిల్ ఆస్పత్రి నిర్వాహకులకు, ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ రాజేష్ వెంకట్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం శిక్షణ ఇచ్చిన కోచ్‌లను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. శిక్షణ పొందిన పిల్లలకు సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో ద్వారకా ఏసీపీ ఆర్.వి.ఎస్.ఎన్ మూర్తి, హైస్కూల్ హెచ్‌ఎం దుర్గాభవాని, పినాకిల్ అడ్మినిస్ట్రేటర్ ఇందిర, డాక్టర్ కృష్ణ పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీ దళార్చన

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు ఆయా వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబరును 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

సాగర సంరక్షణ సమష్టి బాధ్యత

- నేడు ప్రపంచ సముద్ర దినోత్సవం

ఏయూక్యాంపస్: మానవాళి మనుగడకు అవసరమైన ప్రాణవాయువును అధికంగా అందించే సముద్రాలను కాపాడుకుందాం అని కృష్ణ విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి సుంకరి రామకృష్ణారావు అన్నారు. ఆంధ్రా యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం సమావేశ మందిరంలో బుధవారం ఉదయం నిర్వహించిన ప్రపంచ సముద్రాల పరిరక్షణ దినోత్సవంలో ఆయన మాట్లాడారు. 2050 నాటికి చేపలు, ఇతర జీవరాశి కన్నా ప్లాస్టిక్ వ్యర్థాలే సముద్రాలలో అధికంగా ఉంటాయని ఒక సర్వేలో తేలిందన్నారు. ఇటువంటి సమయంలో సముద్రాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మానవాళిపై ఉందన్నారు. ఏయూ సైన్స్ కాలేజీ విశ్రాంత ప్రిన్సిపాల్ డీఈ బాబు మాట్లాడుతూ 50 శాతానికి పైగా ప్రాణవాయువును ఇచ్చే సముద్రాల పరిరక్షణ ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా స్వీకరించాలని సూచించారు. ఏయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆచార్యులు ఎస్. బాలప్రసాద్ మాట్లాడుతూ సముద్రాల పరిరక్షణపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలన్నారు. ఏయూ పర్యావరణ శాస్త్ర విశ్రాంత ఆచార్యులు ఈయూబీ రెడ్డి మాట్లాడుతూ సముద్రాలలోకి విష రసాయనాలు, విషపూరితమైన క్రిమిసంహారాలు, భార లోహాలు వెళ్లకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏయూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.హరనాథ్, జీవ వైవిధ్య మండలి రీజనల్ కో–ఆర్డినేటర్ జానకిరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు, శ్మశానవాటికల అభివృద్ధికి భూమిపూజ



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక : జీవీఎంసీ 71వ వార్డులోని వివిధ ప్రాంతాల్లో రోడ్లు, శ్మశానవాటికల్లో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి బుధవారం భూమిపూజ చేశారు. శ్రీనగర్‌లోని గాయత్రి పెట్రోల్ బంక్ ఏరియా నుంచి విశ్వేశ్వరాయ నగర్ కాలనీ ప్రధాన రహదారి పునర్నిర్మాణానికి రూ.16లక్షలతో చేపట్టనున్న పనులకు శంకుస్థాపన చేశారు. రూ.50లక్షలతో చేపట్టనున్న విశ్వేశ్వరాయనగర్ కాలనీ శ్మశానవాటిక అభివృద్ధి పనులకు , తోకాడ గ్రామానికి చెందిన శ్మశానవాటిక అభివృద్ధికి రూ.50లక్షలతో చేపట్టనున్న పనులకు భూమిపూజ చేశారు. ప్రతి వార్డులో అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా చేపడుతున్నట్లు ఎమ్మెల్యే ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాజాన రామారావు, ఏఈ సౌజన్య, నాయకులు ఐటీఐ సత్యనారాయణ, కటికల కల్పన, పప్పల రాజు, వాసు, నాగేశ్వరరావు, అప్పారావు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

64వ వార్డులో బీటీ రోడ్లకు..

పెదగంట్యాడ: జీవీఎంసీ 64వ వార్డు వెంకన్నపాలెం కొంగపాలెం గ్రామాల్లో రూ.40లక్షలతో చేపట్టనున్న బీటీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమం కార్పొరేటర్ దల్లి గోవింద్, వైఎస్సార్ సీపీ 64వ వార్డు అధ్యక్షుడు ధర్మాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గాజువాకలో అంధకారం

- పెనుగాలులతో కూలిన చెట్లు, ఫ్లెక్సీలు
- 5 గంటలు నిలిచిన విద్యుత్ సరఫరా

గాజువాక : గాజువాకలో బుధవారం అంధకారం చోటుచేసుకుంది. ఉదయం నుంచి ఎండవేడి, అధిక ఉష్ణోగ్రతతో ఉక్కిరిబిక్కిరి చేసిన వాతావరణం సాయంత్రానికి ఒక్కసారిగా మారిపోయింది. సుమారు ఐదున్నర గంటల సమయంలో ఆకాశం ఒక్కసారిగా మేఘావృతం కావడంతో పాటు పెనుగాలులు కుదిపేశాయి. దీంతో ఎక్కడికక్కడ రోడ్లపై, విద్యుత్ స్తంభాలపై ఫ్లెక్సీలు చిందరవందరగా పడిపోయాయి. పలుచోట్ల విద్యుత్ స్తంభాలపై చెట్లు కూడా పడిపోయాయి. ఈ కారణంగా విద్యుత్ తీగలు తెగిపోయినట్టు సంబంధిత సిబ్బంది పేర్కొన్నారు. దీంతో సుమారు ఐదు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీనికి తోడు ఉరుములు, పిడుగులతో కూడిన వర్షం నివాసులను ఆందోళనకు గురిచేసింది. భారీ గాలుల కారణంగా డాబాలపై గల నీటి ట్యాంకుల మూతలు ఎగిరి రోడ్లపైకి వచ్చాయి. వర్షం కారణంగా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడానికి అధికారులు అవస్థలు పడాల్సి వచ్చింది. రాత్రి 11 గంటల సమయంలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడంతో జనం ఊపిరి పీల్చుకున్నారు.

ప్రజల్లోకి విస్తృతంగా కేంద్ర ప్రభుత్వ పథకాలు



తిరుపతిరావును సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

గాజువాక : విశాఖలో ఈ నెల 11న నిర్వహించనున్న కేంద్రమంత్రి అమిత్ షా బహిరంగ సభ తరువాత బీజేపీ ప్రతిష్ట మరింత పెరుగుతుందని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు అన్నారు. పాతకర్ణవానిపాలెంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బీజేపీ మండలాధ్యక్షుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో మోదీ సాధించిన విజయాలు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ఈ సభలో అమిత్ షా వివరిస్తారని పేర్కొన్నారు. ఈ సభద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి మరింత విస్తృతంగా వెళ్తాయన్నారు. సమావేశం అనంతరం ఆయన్ను బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు గూటూరు శంకరరావు, నాగేశ్వరరావు, ముసలయ్య, తాతారావు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యానికి నిదర్శనం



రాంనగర్ మింది రోడ్డులో కల్వర్టులో పడేసిన కొబ్బరి బొండాలు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు రాంనగర్ నుంచి మింది వెళ్లే రోడ్డులో కల్వర్టు వద్ద కొబ్బరి బొండాలు కుప్పలుగా పడి ఉన్నాయి. పరిసర ప్రాంతాల్లో కొబ్బరి బొండాల వ్యాపారులు వీటిని ఇలా పడేస్తున్నారు. తాగి పడేసిన కొబ్బరిబొండాలను వ్యాపారులు, జీవీఎంసీ వ్యానుకు అప్పగించాలి, కానీ ఆ వ్యానుకు డబ్బులు చెల్లించాల్సి వస్తుందని కల్వర్టుల వద్ద పడేస్తున్నారు. కొందరు కొబ్బరి బొండాల వ్యాపారుల నిర్లక్ష్యం నీటి ప్రవాహానికి అడ్డుగా మారుతోంది, దోమలు చేరడంతో జ్వరాల వ్యాప్తికి కారణమవుతోంది. ఇప్పటికే కల్వర్టు పూడికతో నిండి ఉంది, ఇప్పుడు కొబ్బరి బొండాలు కూడా చేరడంతో వర్షాకాలంలో నీరు పోయే మార్గం లేకుండా పోయింది. జీవీఎంసీ పారిశుద్ధ్య సిబ్బంది ఆ వ్యాపారులను గుర్తించి, చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బయో ఇన్నోవేషన్ ఇగ్నిషన్ ప్రోగ్రాంకు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఆచార్యులు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆ హబ్, మేధో సంపత్తి విభాగం, ది సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ అప్లయిడ్ బయోలాజికల్ సైన్సెస్–ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్(టీ క్యాబ్స్–ఇ) సంయుక్తంగా నిర్వహిస్తున్న బయో ఇన్నోవేషన్ ప్రోగ్రాం–2023కు విద్యార్థుల ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. వర్సిటీలోని పలు విభాగాలకు చెందిన విద్యార్థులను మౌఖిక పరీక్షల ద్వారా ఈ కార్యక్రమానికి ఎంపిక చేశారు. వర్సిటీ విద్యార్థులు అలేఖ్యా అధికారి, నిఖిల్ చెన్ను, మహాలక్ష్మి వోలేటి, మోనాలిసా చౌదరి, మునీషా కుసుమే, పూర్ణిమ మల్లూరి, ప్రత్యూష సారపు, సునీత గంట ఎంపికయ్యారు. టి క్యాబ్స్ - ఇ వ్యవస్థాపకుడు డాక్టర్ రవికిరణ్ యేడిది, ఐపీఆర్ చైర్ డాక్టర్ హనుమంతు పురుషోత్తం, ఆ హబ్ సీఈవో రవి ఈశ్వరపు విద్యార్థుల ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులను అధికారులు అభినందించారు.

సామాజిక మాధ్యమాల భూమిక కీలకం



సిరాజ్ ఉర్ రెహమాన్‌ను సత్కరిస్తున్న డాక్టర్ చల్ల రామకృష్ణ

ఏయూక్యాంపస్: మత సామరస్యం, ప్రపంచ శాంతిని పెంపొందించడంలో సామాజిక మాధ్యమాల భూమిక ఎంతో కీలకమని పీస్ మెసేజ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు సిరాజ్ ఉర్ రెహమాన్ అన్నారు. సామాజిక మాధ్యమాలలో మత విద్వేషాలను ఎదుర్కోవడం అంశంపై ఏయూ గాంధీ అధ్యయన కేంద్రం, సెంటర్ ఫర్ ఎమోషనల్ ఎడ్యుకేషన్ సంయుక్తంగా నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొని, ప్రసంగించారు. ఈ సందర్భంగా సిరాజ్ మాట్లాడుతూ అసత్య ప్రచారం, ద్వేషాన్ని రెచ్చగొట్టే వ్యాఖ్యలు ఖండించాల్సిన అవసరం ఉందన్నారు.

గాంధీ అధ్యయన కేంద్రం సంచాలకుడు ఆచార్య చల్లా రామకృష్ణ మాట్లాడుతూ దేశ సమగ్రాభివృద్ధికి ఐక్యతే సాధనంగా నిలుస్తుందన్నారు. వివిధ మతాల మధ్య ఉన్న సారూప్యతలను ప్రచారం చేయడం, మత సహనాన్ని పెంపొందించడానికి దోహదపడుతుందన్నారు. సెంటర్ ఫర్ ఎమోషనల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణవీర్ అభిషేక్ సామాజిక మాధ్యమాలలో వస్తున్న నూతన విధానాలు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ పి.కిషోర్, సుఫీ నద్వీ, కె.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిరాజ్‌ను కేంద్రం తరఫున డాక్టర్ చల్ల రామకృష్ణ సత్కరించారు.